సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 13 । ఆగస్టు । 2025



వామ హస్తం.. వరమే

ప్రతీ వ్యక్తి పుట్టినప్పటి నుంచే కుడి, ఎడమ చేతి వాటాలను సహజ సిద్ధంగా కలిగి ఉంటారని నిపుణులు చెబుతున్నారు. 8లో



పులిగుండాల అభివృద్ధికి నిధులు

పులిగుండాల అటవీ ప్రాంత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం హరిత నిధి నుంచి రూ.4.20 కోట్లు మంజూరు చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

హౌసింగ్‌ బోర్డు సెక్రటరీగా రామాలయ ఈఓ

భద్రాచలం : రామాలయ ఈఓ ఎల్‌.రమాదేవికి ఇటీవల స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించిన విషయం విదితమే. ఆమెను ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించినా ఇప్పటి వరకు పోస్టింగ్‌ ఇవ్వలేదు. కాగా మంగళవారం.. హౌసింగ్‌ శాఖలో సెక్రటరీ పోస్టు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇకపై ఆమె హౌసింగ్‌ శాఖలో విధులు నిర్వర్తించనుండగా.. రామాలయ ఈఓగా మాత్రం ఇంకా ఎవరినీ నియమించలేదు.

విద్యార్థుల భవిష్యత్‌కు 'వ్యక్తిత్వ వికాసం'



మాట్లాడుతున్న పీఓ రాహుల్‌

అశ్వారావుపేట: విద్యార్థుల భవిష్యత్‌ కోసం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంగళవారం ఈ తరగతులు ప్రారంభించారు. మారుమూల ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిత్వ వికాసం పొందాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆదినారాయణ ఈ ఇగ్నైట్‌ అండ్‌ ఇన్‌స్పైర్‌ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్పైర్‌ మైండ్స్‌ – ఇగ్నైటింగ్‌ సోల్స్‌ సంస్థ నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. కాగా, ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పీఓ, ఎమ్మెల్యే విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోటివేటివ్‌ స్పీకర్‌ జైపాల్‌, రంజిత్‌, సుధాకర్‌, రామ్‌, శ్రవణ్‌, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొంటే బిల్లు తీసుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బాబూరావు

గుండాల: రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు అన్నారు. మండలంలోని పలు పురుగుమందుల దుకాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కాలం చెల్లిన మందులు, నాసిరకం ఎరువులు విక్రయించవద్దని నిర్వాహకులకు సూచించారు. పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించి.. యూరియా సరిపడా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందొద్దని అన్నారు. అనంతరం చెట్టుపల్లి, శంభునిగూడెంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అర్హులంతా రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఓ వెంకటరమణ, ఏఈఓ లెనిన్‌, బాలరాజు ఉన్నారు.

డబుల్‌పై ధ్యాసేది?





పాతకొత్తగూడెంలో అర్ధంతరంగా నిలిచిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు (ఇన్‌సెట్‌) నిర్మాణపనులు పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించని ఇళ్లు

డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద చేపట్టిన నిర్మాణాలు ఎందుకూ కొరగాకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. హనుమకొండ తరహాలో జిల్లాలో కూడా నిర్మాణం పూర్తయిన 2బీహెచ్‌కే ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించడం, అసంపూర్తిగా ఉన్న వాటిపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

బీఆర్‌ఎస్‌ హయాంలో 2బీహెచ్‌కే పథకం

- మధ్యలోనే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- నిరుపయోగంగా వందలాది గృహాలు
- హనుమకొండలో ఇటీవల 592 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగింత

అమలుకు నోచని మంత్రి ఆదేశాలు..

జూలై 27న కొత్తగూడెం ఐడీఓసీలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమీక్ష సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన, మధ్యలో ఆగిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వివరాలను గ్రామాల వారీగా సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2 బీహెచ్‌కే ఇళ్లను ఆగస్టు 15లోగా పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్నట్టుగానే ఆయన ఇన్‌చార్జ్‌గా ఉన్న వరంగల్‌ జిల్లాలో ఈనెల 8న నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న 592 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. 2015 జనవరిలో అప్పటి సీఎం కేసీఆర్‌ శంకుస్థాపన చేసిన ఈ ఇళ్లు 2016 నాటికి పూర్తయ్యాయి. అప్పటి నుంచి దాదాపు తొమ్మిదేళ్ల పాటు జీ ప్లస్‌ 3 నిర్మాణంతో కూడిన అపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉండగా.. మంత్రి పొంగులేటి చొరవతో ఈ ఇళ్లు లబ్ధిదారుల వశం అయ్యాయి. దీంతో ఇంత కాలం అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బంది పడిన వారికి సొంతింటి కల సాకారమైంది.

పట్టణ ప్రాంతాల్లో పడావుగా..

జిల్లాలో 'డబుల్‌' పథకానికి సంబంధించి ఇంటి నిర్మాణం పూర్తయి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసిన వాటిల్లో సింహభాగం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఈ పథకంతో ప్రయోజనం పొందిన వారిని వేళ్లపై లెక్కించవచ్చు. జిల్లా కేంద్రంలో పరిశీలిస్తే.. కొత్తగూడెంలో 831 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి కోసం పాత కొత్తగూడెంలో దాదాపు 40 ఎకరాలకు పైగా స్థలంలో భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టారు. వెంచర్‌ తరహాలో ప్లాట్లు చేశారు. విద్యుత్‌ సరఫరా, 20 అడుగులు, 30 అడుగులతో అంతర్గత రోడ్లు, వెంచర్‌ చుట్టూ ప్రహరీ పనులు పూర్తి చేశారు. ఇక్కడ 828 ఇళ్లకు మూడు బ్లాక్‌ల్లో 108 పూరయ్యాయి. జీ ప్లస్‌ 3 పద్ధతిలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో కొన్ని సివిల్‌ పనులు పూర్తి కాగా, విద్యుత్‌, ప్లంబింగ్‌ పనులు కావాల్సి ఉంది. మిగిలిన బ్లాక్‌లు పిల్లర్లు, శ్లాబులు, పునాదుల వరకు పనులు పూర్తయి మొండిగోడలతో దర్శనం ఇస్తున్నాయి. పాల్వంచలో 492 ఇళ్లు మంజూరు కాగా, ఇల్లెందు, మణుగూరు నియోజకవర్గాల్లో, భద్రాచలం పట్టణంలోనూ దాదాపు అంతే ఉన్నాయి. పనులు పూర్తి కాకున్నా.. గత ప్రభుత్వం సాధారణ ఎన్నికల ముందు ఈ ఇళ్లను లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించింది. దీనిపై ఆరోపణలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. నాటి నుంచి నేటి వరకు డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల పథకం ఎటూ కాకుండా పోతోంది.

సగం కూడా పూర్తి కాలే..

తెలంగాణ వచ్చిన వెంటనే అప్పటి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. స్థలంతో సహా ప్రతీ పని తామే చేసి, ఇల్లు పూర్తయ్యాక లబ్ధిదారుడికి అందిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసుకుంది. అయితే అమలు విషయంలో ఒకడుగు ముందుకు.. పదడుగులు వెనక్కు.. అన్నట్టుగా పరిస్థితి మారింది. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలన ముగిసే నాటికి జిల్లాలో డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల నిర్మాణం సగం కూడా పూర్తి కాలేదు. జిల్లాకు 6,168 ఇళ్లు మంజూరు కాగా, 2,973 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, 2,759 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 214 ఇళ్లు పనులు పూర్తయి లబ్ధిదారుల చేతుల్లోకి వెళ్లకుండా పడావుపడి ఉన్నాయి. ఇంకా వివిధ దశల్లో పనులు ఆగిపోయిన ఇళ్లు 3,195 ఉన్నాయి.

పంటలకు ముప్పేమీ లేదు

- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఐడీఓసీ నుంచి హాజరైన కలెక్టర్‌, అధికారులు

దమ్మపేట/సూపర్‌బజార్‌(కొత్తగూడెం) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు ముప్పేమీ లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించగా.. మండలంలోని అప్పారావుపేట వ్యవసాయ క్షేత్రం నుంచి తుమ్మల హాజరయ్యారు. రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని సీఎం సూచించగా.. రైతులతో పాటు అధికారులను కూడా సంసిద్ధం చేస్తున్నామని తుమ్మల చెప్పారు. కాగా, ఐడీఓసీ నుంచి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ వీసీకి హాజరయ్యారు. అనంతరం ఆయన ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం సబ్‌ కలెక్టర్‌ మ్రిణాల్‌ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్‌, విద్యాచందనతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అన్నారు. అధికారులు సెలవులు రద్దు చేసుకుని కార్యస్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న చోట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీపీఓ చంద్రమౌళి, డీఏఓ బాబురావు, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి పాల్గొన్నారు.

అటవీ ఫలాలు దళారుల పాలు కావొద్దు

- ఖాళీ స్థలాల్లో వ్యాపార సముదాయాలు నిర్మించాలి
- జీసీసీ చైర్మన్‌ తిరుపతి



పాల్వంచలో మాట్లాడుతున్న తిరుపతి, పక్కన పీఓ రాహుల్‌

పాల్వంచరూరల్‌ : అడవుల్లో గిరిజనులు సేకరించే ఫలాలు దళారుల పాలు కాకుండా నేరుగా జీసీసీ డీఆర్‌ డిపోలకే చేరేలా సిబ్బంది కృషిచేయాలని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) రాష్ట్ర చైర్మన్‌ కోట్నాక తిరుపతి అన్నారు. పాల్వంచ జీసీసీ బ్రాంచ్‌ను ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనులు సేకరించిన అటవీ ఫలాలకు మార్కెటింగ్‌ సౌకర్యం కల్పించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తే జీసీసీ డిపోలు లాభాల బాట పడతాయని అన్నారు. ఇప్ప పువ్వు, ఇప్పకాయలు సీజన్‌ ఉన్నప్పుడే అధికంగా సేకరించాలని సూచించారు. జీసీసీ ఖాళీ ప్రదేశాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పీఓ రాహుల్‌ మాట్లాడుతూ.. ఇప్ప పువ్వు, ఇప్పబద్దల ద్వారా నూనె తయారీకి గిరిజనులు ముందుకొస్తే ఐటీడీఏ ద్వారా నూనె తీసే యంత్రాలు అందిస్తామని చెప్పారు. జీసీసీ పరిధిలో నడుస్తున్న డీఆర్‌ డిపోలు చాలావరకు మరమ్మతులు నిర్వహించాల్సి ఉందన్నారు. పాల్వంచలో పెట్రోల్‌ పంపు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, ఎన్‌ఓసీ రాకపోవడంతో పనులు నిలిచాయని తెలిపారు. డీఆర్‌ డిపోలు, పెట్రోల్‌ పంపు నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్లు నర్సింహారావు, జయరాజ్‌, రాములు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

భద్రాచలంటౌన్‌: జీసీసీ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జీసీసీ చైర్మన్‌ తిరుపతి స్పష్టం చేశారు. భద్రాచలంలోని జీసీసీ కార్యాలయం, గోడౌన్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీలో గిరిజనుల అభ్యున్నత కోసం కృషి చేయాలని సూచించారు. జీసీసీ పెట్రోల్‌ బంక్‌ల నిర్వహణ, ఆదాయ, వ్యయాలు, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని చైర్మన్‌ ఆదేశించారు.

శిశుమరణాలు నివారించాలి



ఐడీఓసీలో మాట్లాడుతున్న కలెక్టర్‌ పాటిల్‌, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు, ఇతర అధికారులు

కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జిల్లాలో శిశు మరణాల నివారణకు వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ప్రాణం అమూల్యమని, సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే శిశువుల ప్రాణాలు కాపాడొచ్చని అన్నారు. హైరిస్క్‌ గర్భిణులకు ప్రత్యేక పర్యవేక్షణ, సమయానికి వైద్యసేవలు అందించాలని సూచించారు. గిరిజన, గుత్తికోయల ప్రాంతాల్లో పిల్లల ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. శిశువులకు మొదటి ఆరునెలలు పూర్తిగా తల్లిపాలు అందించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్‌ కంట్రోల్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్‌ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్‌, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్‌ : ఎర్త్‌ సైన్సెస్‌ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ జితేష్‌ వి. పాటిల్‌ అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీ ఆవరణలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా ప్రగతికి అనుకూల వాతావరణం నెలకొల్పడమే కాకుండా, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. యూనివర్సిటీ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా విస్తృతంగా ప్లాంటేషన్‌ చేపట్టాలని సూచించారు.

స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలి

చుంచుపల్లి: జిల్లాలో కొత్త స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ పాటిల్‌ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేసి, వాటిలో పేదలకు అవకాశం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతంతో మహిళలకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. వీరందరికీ చిరు వ్యాపారాలు, ఇతర మార్గాల్లో ఆర్థికంగా ప్రోత్సాహం కలిగిస్తామని అన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

పాల్వంచ: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్‌ కళాశాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాలు అందంగా, ఆహ్లాదకరంగా ఉండేలా నీడనిచ్చే చెట్లు, వెదురు మొక్కలు, పండ్ల చెట్లు, ఔషధ మొక్కలు పెంచాలని సూచించారు. విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైనీ కలెక్టర్‌ సౌరబ్‌శర్మ, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఐఈఓ వెంకటేశ్వరరావు, ఆర్టీఓ వెంకటరమణ, కార్పొరేషన్‌ కమిషనర్‌ సుజాత, డీఏఓ బాబురావు, మైనింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జగన్మోహన్‌ రాజు, ఎల్‌బీఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

33 డాక్టర్‌ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 33 వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్‌ పద్ధతిన భర్తీ చేసేందుకు యాజమాన్యం మంగళవారం నోటిఫికేషన్‌ విడుదల చేసింది. వాటిలో 30 జనరల్‌ మెడికల్‌ కన్సల్టెంట్‌ పోస్టులు, మూడు డెంటల్‌ మెడికల్‌ కన్సల్టెంట్‌ పోస్టులు ఉన్నాయని పేర్కొంది. ఈనెల 12 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు https//www.scclmines.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఎంపికైన వారికి నెలకు రూ. 85 వేలు లేదా గంటకు రూ.400 చొప్పున వేతనం చెల్లిస్తామని తెలిపింది.

ఇప్పటికీ ఇసుక తిన్నెలే !

- ఆగస్టు వచ్చినా నిండని గోదావరి
- వర్షాకాలంలోనూ కనిపించని వరద ప్రభావం
- మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరని నీరు
- గత పదిహేనేళ్లలో ఇదే తొలిసారి..



భద్రాచలం వద్ద ఇసుక తిన్నెలతో కనిపిస్తున్న గోదావరి

బూర్గంపాడు: ఆగస్టు వస్తోందంటే గోదావరి వరదలు ఇళ్లు, పంటలను ముంచెత్తుతాయని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతుంటారు. ప్రతీ సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో గోదావరికి వరదలు రావడం పరిపాటి. అలాంటిది ఈ ఏడాది నది నిండా కూడా నీరు ప్రవహించడం లేదు. ఇప్పటికీ భద్రాచలం వద్ద గోదావరిలో ఇసుక తిన్నెలే కనిపిస్తుండడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు అంటున్నారు. మరి ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఎగువనా వర్షాలు అంతంతే..

ప్రతి ఏటా గోదావరి వరదలు భద్రాచలం డివిజన్‌ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటల మునకతో పాటు ఇళ్లలోకీ వరద రావడంతో పలువురు నిరాశ్రయులవుతున్నారు. 2022లో వచ్చిన గోదావరి వరదలకు 10వేలకు పైగా ఇళ్లు నీటమునిగాయి. వేలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. గత ఐదేళ్లుగా జూలైలోనే వరదలు వస్తుండగా ఆగస్టు, సెప్టెంబర్‌ వరకూ కొనసాగుతున్నాయి. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు గోదావరికి ప్రమాదకర స్థాయిలో వరద రాలేదు. జిల్లాతో పాటు గోదావరి బేసిన్‌లో ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిస్తే గోదావరికి వరదలు వస్తాయి. తెలంగాణలో భారీ వర్షాలు కురిసినా కొంతమేర వరద పెరుగుతుంది. ఇక ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత, శబరి, కిన్నెరసానికి కూడా వరదలు లేకపోవడంతో గోదావరి ఉధృతరూపం దాల్చలేదు.

అవసరాలు తీరేదెలా..

గోదావరిలో నీరు తక్కువగా ఉండగా, భవిష్యత్‌ అవసరాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అంటున్నారు. జిల్లాకు మిషన్‌ భగీరథ ద్వారా గోదావరి జలాలనే తాగునీరుగా అందిస్తున్నారు. సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి జిల్లాలో సాగునీటి అవసరాలకూ ఈ నీరే ఆధారం. తాగు, సాగునీటితో పాటు జిల్లాలోని బీటీపీఎస్‌, హెవీ వాటర్‌ ప్లాంట్‌, సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ మనుగడకు కూడా గోదావరి నీరే కీలకం. 2017లో గోదావరిలో నీటి లభ్యత తగ్గడంతో హెవీ వాటర్‌ ప్లాంట్‌ కొన్ని రోజులు మూతపడింది. ఈ ఏడాది ఇప్పుడే గోదావరిలో వరద తక్కువగా ఉండగా రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది రానట్టేనా..?

భద్రాచలంలో గోదావరి వరద 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతాయి. గత ఐదారేళ్లుగా గోదావరి వరద మూడో ప్రమాద హెచ్చరిక వరకు చేరుతూనే ఉంది. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు కనీసం మొదటి ప్రమాద హెచ్చరిక కూడా లేకపోవడం గమనార్హం. ఆగస్టు రెండో వారం వరకూ మొదటి ప్రమాద హెచ్చరిక కూడా జారీ కాకపోవడం గత 15 ఏళ్లలో ఇదే తొలిసారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం గోదావరి వరద నానాటికీ తగ్గుతుండగా.. ఈ ఏడాది వరదలు రాకపోవచ్చనే చర్చ జరుగుతోంది.

కిన్నెరసాని గేటు ఎత్తివేత



ప్రాజెక్ట్‌ నుంచి విడుదలవుతున్న వరద

పాల్వంచరూరల్‌ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1000 క్యూసెక్కుల వరద నీరు రావడంతో మంగళవారం నీటి మట్టం 404.80 అడుగులకు పెరిగింది. దీంతో రాత్రి వేళ ఒక గేటు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మహిళలతో కలిసి.. వరి నాటు వేసి..

దుమ్ముగూడెం మండలంలోని తాలిపేరు కాలువ పూడికతీత పనులను పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్‌ తెల్లం వెంకట్రావు.. కాల్వ సమీపంలో మహిళలు వరి నాట్లు వేస్తుండగా వారితో మాట్లాడారు. ఆ తర్వాత ఆయన కూడా వరి నాట్లు వేయగా.. పలువురు ఆసక్తిగా తిలకించారు.

– దుమ్ముగూడెం



క్లుప్తంగా

పీఆర్‌పీ కోసం ఆందోళన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో అధికారులకు చెల్లించాల్సిన పర్ఫామెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లించటం లేదని, సింగరేణివ్యాప్తంగా ఉన్న సుమారు 2,300 మంది అధికారులు మంగళవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం, ఏరియా జీఎం కార్యాలయం, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ సెక్రటరీ కేశవరావు మాట్లాడారు. ఆరు నెలల నుంచి తమకు రావాల్సిన పీఆర్‌పీ చెల్లించాలని డిప్యూటీ సీఎం, భట్టివిక్రమార్క, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు పలుమార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ ఎవరూ స్పందించలేదని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రెండు నెలల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 5జీ సేవలు



సిమ్ అందజేస్తున్న రాజశేఖర్‌బాబు, శ్రీనివాస్

ఇల్లెందు: జిల్లావ్యాప్తంగా రాబోయే రెండు నెలల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 5జీ సేవలు అందుబాటులోకి వస్తాయని, అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం రాజశేఖర్‌బాబు, ఏజీఎం కె.శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం ఇల్లెందు మండలం కొమరారంలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఇల్లెందులోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 440 బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లు ఉన్నాయని, త్వరలోనే అన్నింటి నుంచి 5జీ సిగ్నల్ అందిస్తామని, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లో ఒక్క రుపాయికే సిమ్ అందజేస్తున్నామని, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఈ సిమ్ పొందిన వారికి మొదటి నెల రీచార్జ్ ఉచితమని, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, ప్రతీ రోజు 2 జీబీ డేటా, 30 రోజుల్లో 100 ఎస్‌ఎంఎస్‌లు ఫ్రీ ఉంటాయని, ఈ ప్లాన్ ఈ నెలాఖరు వరకేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇల్లెందులో పలువురికి ఒక్క రూపాయి సిమ్‌ను అందజేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు మనీశ్‌జైన్, బాలాజీ, భరత్ రెడ్డి, స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

బెటాలియన్, పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, టౌన్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: హర్‌ఘర్ తిరంగాలో భాగంగా సీఆర్పీఎఫ్–141 బెటాలియన్, భద్రాచలం టౌన్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలకు జాతీయజెండాలు కట్టుకుని, సీఆర్పీఎఫ్–141 బెటాలియన్ నుంచి చర్ల రోడ్డు, అంబేడ్కర్ సెంటర్, బ్రిడ్జి పాయింట్ నుంచి సీఆర్పీఎఫ్ క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ రితేశ్‌ఠాకూర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, బెటాలియన్ కమాండెంట్లు రాజేశ్‌యాదవ్, ప్రీత, డిప్యూటీ కమాండెంట్ పత్రాస్‌పుర్తి, డాక్టర్ విజయ్‌కిశోర్ రెడ్డి, భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు డ్రా

భద్రాచలం: బేగంపేట, రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపికకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం లాటరీ తీశారు. గిరిజనుల్లో కోయలకు మూడు, లంబాడీలకు రెండు, మిగిలిన కులాల వారికి ఒక సీటు కేటాయించగా ఇతర కులాల నుంచి దరఖాస్తులు అందలేదు. ఈ మేరకు తల్లిదండ్రులు, విద్యార్థుల సమక్షాన డ్రా తీయించి ఎంపిక చేశామని పీఎంఆర్‌సీ ఏసీఎంఓ రమేశ్ తెలిపారు. కాగా, ఎంపికైన వారు సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోతే వెయిటింగ్ జాబితాలో ఉన్న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి పీజీ హెచ్‌ఎం నర్సింహారావు, ఉద్యోగులు ప్రమీలబాయ్, రామకృష్ణారెడ్డి, రంగయ్య, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,052

వామ హస్తం.. వరమే!

- పుట్టుకతోనే కొందరు ఎడమ చేతివాటం
- అలాంటివారే ప్రతిభావంతులంటున్న నిపుణులు

నేడు వరల్డ్ లెఫ్ట్ హ్యాండర్స్ డే



ఎడమచేతితో రాస్తున్న పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, (ఇన్‌సెట్) ఎడమ చేయితో రాస్తున్న విద్యార్థిని

పాల్వంచరూరల్: కొందరు వ్యక్తుల్లోని భిన్నత్వం వారిని ప్రత్యేకంగా ఉండేలా చేస్తుంది. సాధారణంగా ప్రతీ వ్యక్తిలో భిన్నమైన లక్షణాలు ఉంటే వెంటనే గుర్తించవచ్చు. ప్రతీ వంద మందిలో 95 శాతం మంది కుడి చేతివాటం వారు ఉండగా మిగతా 5 శాతం మంది లెఫ్ట్ హ్యాండర్స్ కనిపిస్తుంటారు. ఎడమ చేతివాటం అనేది జన్యుప్రభావ ఫలితంగా కలుగుతుందని పరిశోధనల్లో తేలింది. నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం.

జన్యు ప్రభావం..

ప్రతీ వ్యక్తి పుట్టినప్పటి నుంచే కుడి, ఎడమ చేతి వాటాలను సహజ సిద్ధంగా కలిగి ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తికి మెదడు కుడి, ఎడమ రెండు అర్ధభాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమ అర్ధభాగం నియంత్రిస్తుందని, కుడి అర్ధభాగం మెదడు బలంగా ఉన్న వారిలో ఎడమ చేతివాటం వస్తుందని చెబుతున్నారు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు ఎడమ చేతివాటాన్ని గమనిస్తే మాన్పించొద్దని సూచిస్తున్నారు.

భిన్నమైన శైలి..

కుడి చేతివాటం వారి కంటే ఎడమ చేతివాటం వారిలో ప్రత్యేక తెలివితేటలుంటాయని, మేధోశక్తి, ఆలోచన, తెలివి భిన్నంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలామంది ఎడమ చేతివాటం వారేనని సమాచారం. ప్రముఖ సినీనటుడు అమితాబ్ బచ్చన్, ప్రఖ్యాత క్రికెటర్లు సౌరవ్ గంగూలి, యువరాజ్ సింగ్ వంటి వారు కూడా ఎడమ చేతివాటం వారే కావడం విశేషం. కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు 8 మంది, దమ్మపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏడుగురు ఎడమ చేతివాటం కలిగి ఉన్నారు.

పనులను మాన్పించొద్దు..

ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వయస్సు నుంచి వస్తువులను పట్టుకోవడం ప్రారంభిస్తారు.అప్పుడే కుడి, ఎడమలను గుర్తించవచ్చు. పిల్లలు ఎడమ చేతివాటం పనులు చేస్తుంటే తల్లిదండ్రులు మాన్పించే ప్రయత్నం చేయొద్దని, అలా చేస్తే సమస్యలు తలెత్తుతాయని నిపుణులంటున్నారు. కుడి చెయ్యితే రోజు వారి పనులు చేయడం సహజం. అయితే, ఆ పనులన్నీ ఎడమ చేతితో చేయడం కాస్త ఇబ్బందిగా మారుతుంది. రోజువారి పనులు ఎడమ చేత్తో చేస్తూ ప్రత్యేకంగా గుర్తింపు పొందిన వారు చాలామంది ఉన్నారని పరిశోధకులు పేర్కొంటున్నారు.

ఎడమ చేతితోనే అలవాటు..



ప్రస్తుతం నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి ఎడమ చేతితోనే రాయడం, పనులు చేయడం అలావాటైంది. ఏ వస్తువు పట్టుకోవాలన్నా తొలుత ఎడమ చెయ్యే ముందుగా కదులుతుంది.

–పి.సుప్రియ, విద్యార్థిని

మాన్పించాలని యత్నించారు..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఎడమ చేతితోనే రాస్తుంటాను. ఇతర పనులు కూడా ఎడమ చేతితోనే చేస్తాను. అలానే అలవాటైంది. తల్లిదండ్రులు చిన్నప్పుడు ఎడమచేతితో రాయొద్దని వారించారు. కానీ, ఎడమ చేతితో రాయడమే అలవాటుగా మారింది.

–కట్టా దామోదర్‌రెడ్డి, అటవీ డివిజన్ అధికారి

జన్యు ప్రభావంతోనే..



తల్లి కడుపులో శిశువు ఉన్నప్పుడే జన్యువుల ప్రభావంతోనే ఎడమ చెయ్యివాటం వస్తుంది. తల్లిదండ్రులు ఎడమ చేతి వాటాన్ని మాన్పించకూడదు. నేను కూడా చిన్నప్పుడు ఎడమ చేయితో రాసేవాన్ని. తల్లిదండ్రులు మాన్పించారు.. కానీ, మిగతా పనులు మాత్రం ఎడమచేయితోనే చేస్తాను.

–డాక్టర్ జి.దేవేందర్. ఉల్వనూరు పీహెచ్‌సీ

ఆయువు పోయినా.. ఆయుష్షు పోస్తూ..



- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన అవగాహన

నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

సుజాతనగర్: అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి. ఏ లోకంలో ఉన్నా మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి. మన శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం లబ్ డబ్ అని కొట్టుకుంటూనే ఉంటుంది.. 'ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం.. రండి అవయదానం చేద్దాం.. మరణించినా మరో వ్యక్తిలో జీవించే ఉందాం'.. అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా కొందరు ఇంకా అపోహలు, అనుమానాలతో వెనకడుగు వేస్తున్నారు. కానీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. ఏటా ఆగస్టు 13న 'ప్రపంచ అవయవదాన దినోత్సవం' నిర్వహిస్తున్న సందర్భంగా కథనం.

● చండ్రుగొండ మండలంలో..



తాను మరణించినా ముగ్గురికి అవయవదానం చేశాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం టేకుల బంజర గ్రామానికి చెందిన రైతు పల్లె వెంకన్న. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకన్న కంటిపరీక్షల నిమిత్తం రెండేళ్ల కిందట పాల్వంచ వెళ్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స అందించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు తెలిపారు. కుటుంబసభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. కాలేయంతో పాటు, రెండు కళ్లను సేకరించారు.

● బ్రెయిన్‌డెడ్ అవడంతో..



ఓ వ్యక్తికి బీపీ కారణంగా బ్రెయిన్‌డెడ్ కాగా అతడి కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన కిశోర్‌లాల్ సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కోల్ లోడింగ్ కార్మికుడిగా పనిచేసేవాడు. బీపీ పెరిగి మెదడులో రక్తస్రావం జరగడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్ తరలించారు. పరీక్షల అనంతరం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అవయవదానంపై కిశోర్‌లాల్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యులు అంగీకరించి అవయవదానం చేశారు.

● వృద్ధురాలు సైతం..



గరీబ్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం తండాకు చెందిన పెద్ది కొమరమ్మ రెండేళ్ల కిందట ఆస్పత్రికి వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. తలకు బలమైన గాయం అయింది. ఈమె భర్త సింగరేణి మాజీ ఉద్యోగి కావడంతో తొలుత సింగరేణి ఆస్పత్రిలో వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ క్రమంలో బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ ప్రసాదించవచ్చని వైద్యులు కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. కొమరమ్మ మూత్రపిండాలు, కాలేయంను వైద్యులు సేకరించారు.

పాఠశాలలో తాచుపాము కలకలం

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం తాచుపాము కలకలం సృష్టించింది. పాము పాఠశాల ప్రాంగణంలోకి రావడంతో గుర్తించిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు సంగయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన చేరుకుని పామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించి, అడవిలో వదిలాడు.

ఆలయంలో చోరీ

పాల్వంచరూరల్: మండల పరిధి యానంబైల్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు గుడి తాళాన్ని పగలగొట్టి, హుండీని ధ్వంసం చేసి, భక్తుల కానుకలను చోరీ చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు శిరసాని వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని రామాంజనేయపురంలోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు మంగళవారం సమాచారం అందింది. దాడి చేసి, అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడేనికి చెందిన ధరావత్ బాలాజీకి చెందిన పూరింట్లో స్విచ్ బోర్డు వద్ద మంటలు వ్యాపించి అంటుకున్నాయి. బాలాజీ కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో భార్య చంద్రావతి, కుమార్తె గమనించి భయందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. చుట్టు పక్కల వారంతా చేరుకొని మంటలను ఆర్పేందుకు యత్నించగా ఇళ్లంతా కాలి బూడిదైంది. కాగా, ఇంట్లో గ్యాస్ బండ పేలిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. బీరువాలో భద్రపరిచిన రూ.1.50 లక్షలు, నగదుతోపాటు సామగ్రి అంతా కాలిపోగా, సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా. సమాచారం అందుకున్న అశ్వారావుపేట ఫైర్ ఇంజన్ ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే అంతా కాలి బూడిదైంది. అగ్ని మాపక శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: అశ్వారావుపేటలో 2022లో జరిగిన ఆర్‌ఎంపీ చక్రధర్‌రావు హత్య కేసులో నిందితుడు షేక్ నజీర్‌కు జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. అశ్వారావుపేట తిరుమలకుంటలో లింగాల చక్రధర్‌రావు తన భార్య విజయలక్ష్మితో కలిసి ఉంటున్నారు. 2022, డిసెంబర్ 8న దురదపాడు నుంచి ఫోన్ వచ్చిందని, భోజనం చేసి, పడుకోమని భార్యకు చెప్పాలని వరుసకు కోడలయ్యే దాసరి రమణకు చెప్పి వెళ్లాడు. మరుసటి రోజు భార్య విజయలక్ష్మి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. మరోసారి చేస్తే ఓ వ్యక్తి ఎత్తి మందులు తెచ్చేందుకు భద్రాచలం వెళ్లారని చెప్పాడు. అనుమానంతో విజయలక్ష్మి తన కూతురుకు ఫోన్‌చేసి ఆరాతీసింది. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు విజయ్‌బాలు.. ఓ వాట్సప్ గ్రూప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వినాయకపురంలోని గుగులోత్ వెంకటేశ్వరరావుకు చెందిన జీడిమామిడి తోటలో ఉందని తెలిసింది. అనుమానంతో చక్రధర్‌రావు కుమార్తె అక్కడికి వెళ్లి చూసి, మృతదేహం తన తండ్రిదేనని గుర్తుపట్టింది. అదే రోజు అశ్వారావుపేట పోలీసులకు విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, తుమ్మలకుంట వాసి షేక్ నజీర్‌ను నిందితుడిగా తేల్చి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 22 మందిని విచారించిన జడ్జి షేక్ నజీర్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పీపీ పీవీడీ లక్ష్మి వాదించగా.. ఎస్‌ఐ వై.రాజు, కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, లైజన్ ఆఫీసర్ ఎన్.వీరబాబు, పీసీబీలు బి.నాగేశ్వరావు సహకరించారు.

ఇసుక లారీ పట్టివేత

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని రాజమండ్రి వద్ద గోదావరి నుంచి లారీలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయంగా సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి గుంపన వద్ద జాతీయ రహదారిపై దాడి చేసి లారీని పట్టుకున్నారు. తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీడ్రైవర్ స్వర్గం పాపారావుతోపాటు యజమాని సాలె రాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు వెలువరించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దిండిగల్ గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన నాయక్ మల్లేష్, గడ్డం భువన్ అలియాస్ ఎరుగుంట్ల రవితేజతో పాటు ఇషాక్ జల్సాలకు అలవాటు పడి అక్రమార్జన కోసం గంజాయి రవాణా చేస్తున్నారు. ఈక్రమంలోనే 2021 ఏప్రిల్ 28న కారులో రూ.30 లక్షల విలువైన 200 కేజీల గంజాయితో వస్తుండగా, ఖమ్మం సమీపాన వి.వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ ఉండడంతో వేగం పెంచారు. ఈక్రమంలో ప్రయాణికులతో ఉన్న ఆటోను ఢీకొట్టగా రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఆటోలో వెళ్తున్న ఒకరు మృతి చెందగా పోలీసులు చేరుకుని కారులో పరిశీలించడంతో 200 కేజీల గంజాయి లభించింది. ఈమేరకు మల్లేష్, భువన్ పట్టుబడగా ఇషాక్ పారిపోయాడు. వీరిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువు కావటంతో ఇద్దరికి 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు విచారణ గత, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, ఉస్మాన్ షరీఫ్ చేయగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఏ.శంకర్, జె.శరత్‌కుమార్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది జి.రవికిషోర్, సాంబశివరావు, కె.శ్రీకాంత్, ఎం.డీ.అయూబ్ సహకరించారు.

ఇల్లెందు, మానుకోటకూ 'సీతారామ' జలాలు ఇవ్వండి

సీఎంకు విన్నవించిన మాస్‌లైన్ నాయకులు



సీఎంకు సమస్యలు వివరిస్తున్న రంగారావు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీతారామ ప్రాజెక్టును ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాలకు సైతం అనుసంధానించి సాగునీరు సరఫరా చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం మాస్‌లైన్ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో సీతారామ ప్రాజెక్టును నిర్మించినా ఇల్లెందు ప్రాంత రైతులకు ప్రయోజనం లేదన్నారు. అన్ని ప్రాంతాలకు సీతారామ నీరు అందేలా చూడాలని కోరారు. అలాగే, పోడు సాగుదారులకు పొజిషన్ హక్కులు కల్పించి, అర్హులకు పట్టాలు జారీ చేయాలని, పోడు రైతులపై అటవీ అధికారుల దాడులను నిలిపివేయించాలన్నారు. అంతేకాక వ్యవసాయ కూలీలకు రూ.12 వేల భృతి, పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500 చెల్లింపుతో పాటు పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాక మంత్రులు జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు మాస్‌లైన్, ఇతర వామపక్షల పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా అధికారులకు సూచనలు చేస్తానని చెప్పారని రంగారావు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు కేజీ రాంచందర్, కె.రమ, కె.సూర్యం పాల్గొన్నారు.

పులిగుండాల అభివృద్ధికి రూ.4.20కోట్లు

- కిన్నెరసాని, భద్రాచలం, పులిగుండాల సందర్శనకు ప్యాకేజీ
- ఖమ్మం డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్



వీఎస్‌ఎస్ సభ్యులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని పులిగుండాల అటవీ ప్రాంతాన్ని ఎకో టూరిజం విభాగంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.4.20 కోట్లు మంజూరు చేసిందని జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తెలిపారు. ఇందులో మొదటి విడతగా రూ.1.89 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. సత్తుపల్లి చెక్‌పోస్టు, క్వార్టర్లు, టింబర్ డిపోను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కంటైనర్ ఆస్పత్రి, వాచ్‌టవర్‌ను పరిశీలించాక చంద్రాయపాలెంలో వనసంరక్షణ సమితి బాధ్యులతో మాట్లాడారు. పులి గుండాల ఎకో టూరిజం, కిన్నెరసాని, భద్రాచలంను సందర్శించేలా ప్యాకేజీ రూపొందిస్తున్నట్లు తెలి పారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే టింట్‌తో బస ఏర్పాటు చేస్తామని, పులిగుండాల వద్ద బ్యాటరీ వాహనంతో పాటు రెండు సఫారీ వాహనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సందర్శకుల కోసం సోలార్‌బోట్ సమకూర్చడమే కాక ప్రాజెక్టు వద్ద రక్షణ కోసం ఫెన్సింగ్, 30 కి.మీ. సఫారీ రూట్, కాకతీయుల తోరణంతో గేట్, రిసెప్షన్ సెంటర్ నిర్మించనున్నట్లు తెలిపారు. పులిగుండాల గుట్టపై పల్లెర్ల బావి, వీరభద్రస్వామి ఆలయం, పాలపిట్ట వాచ్ టవర్‌తో పాటు జలపాతం సందర్శకులకు ఆహ్లాదాన్ని అందిస్తాయని డీఎఫ్‌ఓ తెలిపారు.

పోడుదారులపై చర్యలు

అడవిలో పోడు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ హెచ్చరించారు. అటవీ సంరక్షణ, అక్రమ తవ్వకాల నివారణ, వన్యప్రాణి రక్షణ, అటవీ అభివృద్ధిపై వీఎస్‌ఎస్ సభ్యులతో చర్చించాక సూచనలు చేశారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ వి.మంజుల, టాస్క్‌ఫోర్స్ రేంజర్ శ్రీనివాసరావు, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌ఫర్ట్ దీపక్‌నారాయణ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

ఇల్లెందు: ఇల్లెందు సంజీవయ్యకాలనీ నంబర్–2 బస్తీకి చెందిన దంపతులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదైంది. బస్తీకి చెందిన గిరిజన మహిళ సున్నం శ్వేత – ఆమె భర్త రాజేశ్‌పై ఇందిరానగర్‌కు చెందిన రావూరి రవి, ముక్కు శ్రీనివాస్, వల్లపు అరవింద్ దాడి చేశారు. ఈ నెల 11న సంజీవయ్య కాలనీలో ఇద్దరికి మధ్య గొడవ జరుగుతుండగా శ్వేత దంపతులు సర్దిచెప్పారు. దీంతో ఆగ్రహం పెంచుకున్న రవి, శ్రీనివాస్, అరవింద్ తమపై దాడి చేశారని శ్వేత ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హసీనా తెలిపారు.